క్లుప్తంగా

28 నుంచి కె.జె.పురంలో భూముల రీసర్వే

మాడుగుల రూరల్ : ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే కార్యక్రమంలో భాగంగా మేజరు గ్రామ పంచాయతీ అయిన కె.జె.పురం గ్రామంలో రీసర్వే ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని తహసీల్దార్ కె.రమాదేవి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం అమె మాట్లాడారు. కె.జె.పురం రెవెన్యూ పరిధిలో గల 1816 ఎకరాల భూమికి సంబంధించి రీసర్వేకు గాను ఆన్‌లైన్‌లో వున్న ప్రతి సాగుదారునికి నోటీసులు గురువారం నుంచి జారీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. వీఆర్‌ఓలు, సర్వేయ ర్లు, వీఆర్‌ఏలతో కూడిన ఎనిమిది బృందాలు భూములు మీదకు వెళ్లి సర్వే నిర్వహిస్తారని, సాగుదారులు తమ భూమి పాసుపుస్తకం, వన్‌బీ, పాస్‌ఫొటోలతో రీసర్వే చేసేటప్పుడు అందించాలన్నారు. తమ భూమి రీసర్వే ఎప్పుడు జరుగుతుందనే విషయం ముందుగానే రైతులకు చరవాణి ద్వారా తెలియపరుస్తామన్నారు. రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు.

జీవో నంబరు 35 సవరించాలి


నిరసన తెలుపుతున్న పీఆర్ ఉద్యోగులు

నాతవరం : పంచాయతీరాజ్‌శాఖలో ఎంపీడీవోలు ఇతర అధికారులకు పదోన్నతుల విషయంలో పాత పద్ధతినే అనుసరించాలని డిమాండ్ చేస్తున్నారు. నాతవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం పంచాయతీ శాఖకు చెందిన అధికారులు నిరసన తెలిపారు. రాష్ట్ర జిల్లా నాయకత్వం పిలుపు మేరకు పదోన్నతులకు కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుకు నిరసన అందోళన చేపట్టామన్నారు. జీవో నంబరు 35కు తక్షణమే సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ పోలుపర్తి సారథి కార్యాలయ సీనియర్ అసిస్టెంటు ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా చిన్నంనాయుడు



నాతవరం : సీపీఐ నాతవరం మండల కార్యదర్శిగా పెద జగ్గంపేట గ్రామానికి చెందిన అంకంరెడ్డి చిన్నంనాయుడును నియమించారు. మండలంలో శనివారం తాండవ గ్రామంలో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో జిల్లా సీపీఐ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఆయనకు మండల పార్టీ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి చిన్నంనాయుడు మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తానన్నారు. ఆయనను పార్టీ నేతలు గురుబాబు, కొండలరావు, గంగాభవానీ రాజుబాబు, అప్పారావు అభినందించారు.

అర్జీదారులతో కౌన్సెలింగ్

మాడుగుల రూరల్ : ప్రజాసమస్యలు వేదిక(పీజీఆర్ఎస్)లో వివిధ అర్జీలపై మండల స్థాయి కమిటీ తహసీల్దారు కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. తహసీల్దారు కె.రమాదేవి ఆధ్వర్యంలో పరిష్కారం కాని సమస్యల గురించి ఇరు వర్గాలను పిలిచి మాట్లాడారు. భూ సమస్యలపై జిల్లా కలెక్టరు కార్యాలయానికి అర్జీలు సమర్పించిన వారితో ప్రతి శనివారం తహసీల్దారు కార్యాలయంలో ఇరు వర్గాలతో రాజీకి ప్రయత్నిస్తున్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎస్ఐ నారాయణరావు పాల్గొన్నారు.

కూటమి హామీలు నెరవేర్చాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

నాతవరం : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఉద్యమించే సమయం ఆసన్నమైందని జిల్లా సీపీఐ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. తాండవలో శనివారం సీపీఐ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించి ముందుగా ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాబోతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కంటే రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడానికే ప్రాధాన్యం ఇస్తున్నట్టు కనిపిస్తుందన్నారు.

మీడ్డేమీల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నర్సీపట్నం : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మీడ్డేమీల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయు కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ వేతన బకాయిలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, వంట గ్యాస్ పంపిణీ చేయాలని కోరారు. కార్మికులకు ఐడీ కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని, ప్రమాద బీమా కల్పించాలని అన్నారు. రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. సమావేశంలో సత్యవతి, లక్ష్మి, జగద, నూకరాజు పాల్గొన్నారు.

కలగా మిగిలిన పెద్దేరు వంతెన

రామజోగిపాలెం, చాకిపల్లి రైతుల ఆవేదన

ఎమ్మెల్యే రాజు ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్

ఏటికి ఎదురీత ఇంకెన్నాళ్లు!


రామజోగిపాలెం వద్ద పెద్దేరు నదిని తాడు సహాయంతో దాటుతున్న రైతులు

చోడవరం : ప్రాణాపాయమని తెలిసినా నది దాటడం ఆయా గ్రామాల రైతులకు తప్పనిసరిగా మారింది. నేతల హామీలు నీటి మూటలుగా మిగలడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా...తమ జీవనోపాధి జరగాలంటే వందలాది మంది రైతులు నదిలో ఎదురీత ఈదక తప్పడం లేదు. 2015లో శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ ఎటువంటి పనులు ప్రారంభం కాకపోవడంతో ఆ గ్రామాల బాధ వర్ణనాతీతంగా ఉంది. చోడవరం మండలం రామజోగిపాలెం, చాకిపల్లి గ్రామాల రైతుల దయనీయ గాథ ఇది. ఈ రెండు గ్రామాలకు చెందిన రైతుల భూములన్నీ గ్రామాలకు ఆనుకొని ప్రవహిస్తున్న పెద్దేరు నదికి అవతల ఉన్నాయి. తెల్లవారింది మొదలు సాయంత్రం అయ్యే వరకు పొలం పనిమీద తరుచూ ఈ నది దాటుతూ ఉండాల్సిన పరిస్థితి. అయితే నదిపై కనీసం కాలిబాట వంతెన కూడా లేకపోవడంతో రోజూ పొలంలోకి వెళ్లి, వచ్చేందుకు రైతులంతా నదిలో ఈదుకొని వెళ్లాల్సి వస్తుంది. మహిళలు, పిల్లలకు సైతం ఈ ప్రమాదకర ఈత ప్రయాణం తప్పడంలేదు. రోజువారీ జరుగుతున్న ఈ ప్రయాణంలో పలువురు రైతులు, రైతు పిల్లలు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. నదిలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు, భారీ వర్షాలు కురినప్పుడు నది దాటడం ప్రాణాలతో చెలగాట మాడటమే. అయినా పొలాలు, పాకలు, పశువులు అన్నీ నదికి ఆవలే ఉండటం వల్ల తప్పని పరిస్థితుల్లో ప్రమాదమనితెలిసినా పారే నదిలో ఎదురీదక తప్పడం లేదు. తుపానుల సమయంలో వ్యవసాయం, పశువులను చూసుకునేందుకు వెళ్లాలంటే పీఏస్‌పేట చెరకు కాటా వద్ద సుమారు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న వంతెన దాటి మరలా మరో 7కిలోమీటరు ఆవల నది గట్టు మీదుగా పొలాల్లోకి వెళ్లాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల నుంచి తమను రక్షించేందుకు రామజోగిపాలెం సమీపంతో పెద్దేరునదిపై చిన్నపాటి వంతెన నిర్మించాలని యేళ్లతరబడి ఆ గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ వేసవిలోనైనా వంతెన నిర్మాణపనులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

హామీ నెరవేర్చాలి

కనీసం కాలిబాట వంతెనైనా లేకపోవడంతో పెద్దేరు నది దాటడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. పదేళ్ల కిందట డెయిరీ సహకారంతో నిర్మిస్తామని అప్పటి ప్రభుత్వం శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటికీ వంతెన పనులు ప్రారంభించలేదు. ఈ వేసవిలో నిర్మాణం పూర్తిచేయాలి. మరలా వర్షాలు కురిస్తే నదిలో నీటి ప్రవాహం పెరిగి వంతెన పనులు జరగవు. ఎమ్మెల్యే రాజు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. నదిపై వంతెన నిర్మించాలి.
– రొంగలి అప్పలనాయుడు, రైతు, రామజోగిపాలెం

రెండు గ్రామాలకు కష్టాలు

అందరిలాగే పదేళ్లుగా ఎమ్మెల్యే రాజు ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. మాకు వంతెన కడితే ఈ రెండు గ్రామాల ప్రజలకు మేలుచేసిన వారవుతారు. ప్రాణాలు అరచేత్తో పట్టుకొని రోజూ నది దాటి వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా వంతెన నిర్మించాలి.
–జి. వెంకటరమణ, రైతు, చాకిపల్లి

ఉపాధి కూలి రేట్లు పెంచాలి


వడ్డాది సచివాలయం వద్ద ఎండలో బైఠాయించి ఆందోళనకు దిగిన కూలీలు

బుచ్చెయ్యపేట : ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పని కొలతలు సవరించి రోజు కూలీ గిట్టుబాటు కల్పించాలని వందలాది మంది కూలీలు ఆందోళనకు దిగారు. శనివారం కూలి పనులు ముగించుకున్న తరవాత మండుటెండను సైతం లెక్కచేయకుండా వడ్డాది సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యాలయం గేట్ల వద్ద బైఠాయించి ముట్టడి నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండుటెండలో చేతులు బొబ్బలెక్కేలా ఉపాధి పనులు చేస్తున్నా రోజు కూలి మాత్రం రూ.100 రావడం లేదని ఆవేదన చెందారు. ఉపాధి హామీ పథకంలో కొలతల విధానాన్ని సవరించాలన్నారు. రోజువారి కూలీ రూ. 307 ఉన్నా ఒక్క కూలీకి ఈ ధర అందించడం లేదన్నారు. పని ప్రదేశంలో నీడ వసతి, మంచినీళ్ల సదుపాయం, వేసవి అలవెన్స్‌లు అందించడం లేదన్నారు. వందలాది మంది కూలీలు ఆందోళనలో పాల్గొని ఈవో లవరాజుకి వినతి పత్రం అందించారు. కూలీలకు మద్దతుగా సీఐటీయు నాయకులు నాయుడు, సాంబశివరావు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సాగుకు జీవం


వ్యవసాయ సిబ్బందితో కలిసి మట్టి నమూనాలను సేకరిస్తున్న ఏవో వై. కాంతమ్మ

దేవరాపల్లి : ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా సాగుకు జీవం సమకూరుతుందని మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ సూచించారు. దేవరాపల్లిలోని పంట పొలాల్లో భూసార పరీక్షలు నిమిత్తం మట్టి నమూనాలను శనివారం సేకరించారు. మండలంలోని 27 పంచాయతీల పరిధిలో 1100 మట్టి నమూనాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. పంట సాగు ఉన్న పొలంలోను, నీడ, పశువుల గెత్తం ఉన్న చోట, నీరు నిల్వ ఉన్న చోట మట్టి నమూనాలు సేకరించకూడదన్నారు. పొలంలో 7 నుండి 9 చోట్ల నుంచి కేజీ మట్టిని సేకరించి, వీటిలో అరకేజీ మట్టిని మాత్రమే భూసార పరీక్షలకు పంపిస్తామని ఏవో తెలిపారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన


విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్న హెచ్‌ఎం వీరాంజనేయులు

కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు అందించడం జరుగుతుందని పాచిలవానిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్.వీరాంజనేయులు అన్నారు. పాచిలవానిపాలెంలో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న, బడిఈడు వయస్సు గల విద్యార్థుల తల్లిదండ్రులను ఆయన వారి ఇంటికి వెళ్లి కలిశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందని, ప్రతి విద్యార్థి చదువులపైనా ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుందని తెలిపారు. యూనిఫాం, నోట్ పుస్తకాలతో పాటు మంచి పోషకాహారంతో మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తారని వీరాంజనేయులు తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సత్యవతి పాల్గొన్నారు.

రోలుగుంట : తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శెట్టి మోహన్‌రావు ఉపాధ్యాయ సిబ్బంది ఐదు రోజులుగా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. రాత్రిపూట ఇంటింటా తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంతో పాటు గత ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా సంస్కరణల్లో భాగంగా అన్ని వర్గాల వారు కోరుకుంటున్న ఇంగ్లిష్ మీడియం కూడా ఉచితం అందుతుందని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో విద్యావతి, అప్పనరాంబాబు, సాంబశివరావు, జగ్గారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలిసెట్ మాక్ టెస్ట్‌లో సత్తా చాటిన విద్యార్థి


విద్యార్థి ఆనంద భాస్కర్‌కు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న గోపీనాథ్, వరప్రసాద్

నర్సీపట్నం : అవంతి విద్యా సంస్థల వారు డివిజన్‌స్థాయిలో నిర్వహించిన పాలిసెట్ మాక్ టెస్ట్‌లో విద్యార్థి కామిరెడ్డి ఆనంద భాస్కర్ మొదటి ర్యాంకు సాధించాడు. పీఆర్టీయు నిర్వహిస్తున్న ఉచిత పాలీసెట్ కోచింగ్ మాక్ టెస్ట్‌కు దోహదపడిందని విద్యార్థి ఆనంద భాస్కర్ పేర్కొన్నాడు. పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, విద్యాసంస్థల ప్రతినిధి శ్రీఫణి వరప్రసాద్ విద్యార్థికి రూ.2 వేలు నగదు, జ్ఞాపికను బహూకరించి అభినందించారు.

బోయిలకింతాడలో సమస్యల పరిష్కారానికి కృషి

దేవరాపల్లి : బోయిలకింతాడ గ్రామంలో శనివారం మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి, తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో సువర్ణరాజు తదితరులు పర్యటించారు. క్షేత్రస్థాయి సమస్యలతో పాటు ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ, కొత్తూరులో మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి ఏర్పడిన ఆటంకంపైన, గ్రామ కంఠ స్థలాల ఆక్రమణ తదితర సమస్యలపై సర్పంచ్ బాబూరావు, ప్రజల సమక్షంలో చర్చించారు. ఈ సమస్యలను పరిష్కరించి త్వరలోనే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

బ్యాంక్ లింకేజీ రుణాలతో జీవనోపాధి పొందండి

కె.కోటపాడు : డ్వాక్రా సంఘాల్లో మహిళలకు మంజూరు చేసే బ్యాంక్ లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోని జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలని వెలుగు ఏపీఎం చినబాబు అన్నారు. కె.కోటపాడు వెలుగు కార్యాలయంలో శనివారం మండల మహిళా సమాఖ్య సమావేశం అధ్యక్షురాలు ఆర్.యశోధ ఆధ్వర్యంలో జరిపారు. ఈ సందర్భంగా ఏపీఎం చినబాబు మాట్లాడుతు మండలంలో గల 1422 డ్వాక్రా సంఘాలకు 2025-26 వార్షిక సంవత్సరంలో సుమారు రూ.50 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను, స్త్రీనిధి కింద రూ.9కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

గుంటూరులో రైతు సదస్సుకు తరలిరండి

బుచ్చెయ్యపేట : గుంటూరులో ఈ నెల 29,30వ తేదీల్లో జరిగే ఆచార్య ఎన్‌జి రంగా విశ్వ విద్యాలయం వజ్రోత్సవం(డైమండ్ జూబ్లీ) వేడుకలకు రైతులు తరలిరావాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సమన్వయకర్త డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. విశ్వవిద్యాలయం ఏర్పాటై 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరు సమీపంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లా ఫారంలో వజ్రోత్సవ వేడుకలను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ సదస్సులో చిన్న కమతాల్లో సుస్థిరమైన నికర ఆదాయం పొందకలిగే సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అవగాహన కల్పిస్తారన్నారు.

సాంకేతిక నైపుణ్యంతో ఉద్యోగ అవకాశాలు

మాకవరపాలెం : సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలకు బాటలు వేసుకోవచ్చని మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఇండస్ట్రీ కనెక్ట్ పేరుతో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ గేమ్ ప్లాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కమ్యునికేషన్‌లో వెనకబడినా చాలా మంది విద్యార్థులు విషయ, సాంకేతిక పరిజ్ఞానంలో ముందుంటారన్నారు.


నేడు పలు గ్రామాల్లో గ్రామదేవతలు పండగలు


నాతవరం: మండలంలో మర్రిపాలెం పంచాయతీ శివారు కొత్త ఎల్లవరం సిద్ధిపట్నం గ్రామాల్లో కోట సంతానమ్మ తల్లి పండగ మహోత్సవం సందర్భంగా గరగల సంబరం ఘనంగా ప్రారంభమైంది. కోట సంతానమ్మ పండగను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్మాణ దాత సత్యనారాయణ శర్మ శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమావాస్య సందర్భంగా ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికరానుండడంతో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాజుపేట అగ్రహారం గ్రామంలో కూడా కోట సంతానమ్మ తల్లి పండగ, వెన్నలపాలెం, ములగపూడి, మర్రిపాలెం గ్రామాల్లో తలుపులమ్మ తల్లి పండగ, వై.బి.అగ్రహారం గ్రామంలో మైసమ్మ తల్లి పండగను నిర్వహించనున్నారు.

జాబ్‌మేళాకు స్పందన


చోడవరం : జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో చోడవరం గవర్నమెంటు హైస్కూల్ ఆవరణలో మెగా జాబ్‌మేళాను శనివారం నిర్వహించారు. ఈ మేళాను ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ప్రారంభించారు. వందలాది మంది నిరుద్యోగులు ఈ మేళాలో ఉద్యోగావకాశాల కోసం వచ్చారు. సుమారు 23 ప్రైవేటు కంపెనీలు తమ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ సంస్థల్లో 1620 ఉద్యోగాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే రాజు చెప్పారు.

కాశ్మీర్ ఉగ్రదాడులపై పెల్లుబికిన నిరసనలు


కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ


కె.కోటపాడులో ప్లకార్డులతో నిరసన


దేవరాపల్లిలో ఉగ్రవాదుల దిష్టి బొమ్మల దహనం


రావికమతంలో శాంతి ర్యాలీ

దేవరాపల్లి : జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ మృతులకు సంతాపంగా దేవరాపల్లిలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో మృతులకు నివాళులర్పించారు. ఉగ్రవాదుల దిష్టి బొమ్మలు దహనం చేశారు. మాజీ ఎంపీపీ భాస్కరరావు, మాజీ సర్పంచ్ తాతయ్యలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కాశ్మీర్‌లో ఉగ్రవాదులు హిందువులపై దాడులకు పాల్పడడాన్ని అందరూ ముక్త కంఠంతో ఖండించాలని చోడవరం ప్రెస్ క్లబ్ ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ఎస్.సతీష్ అన్నారు. శనివారం మండల అధికారులతో కలిసి నిరసన చేపట్టారు. ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, ఏపీఎం చినబాబు, ఏపీయూడబ్ల్యూజె జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రాధాకృష్ణ పాల్గొన్నారు.

మాడుగుల: కాశ్మీర్‌లో టెర్రరిస్టులు సాగించిన ఉన్మాద చర్య అత్యంత హేయమని, మండల కోఆప్షన్ మెంబరు, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ మైనారిటీ జనరల్ సెక్రటరీ అహ్మద్ ఉన్నీసా ఖండించారు. దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితిలో సహించరాదన్నారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు.

రావికమతం : కాశ్మీర్‌లో యాత్రికులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు(ఏపీయు డబ్ల్యూజే) మాడుగుల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు కంచిపాటి జగ్గారావు, సర్పంచ్ మోదినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, మండల వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు మహాలక్ష్మినాయుడు, తహసీల్దార్ వెంకటరమణ, ఎస్ఐ రఘువర్మ, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.

చోడవరం : ఉగ్రవాదులు దాడులు పాక్ దుశ్చర్యే అని నినాదాలు చేస్తూ చోడవరం ఉపాధ్యాయులు, ఎల్ఐసీ ఏజెంట్లు శనివారం వేర్వేరుగా నిరసన ర్యాలీలు చేశారు. ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపగా, ఎల్ఐసి ఏజెంట్లు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు.

ఈర్లె అనురాధకు నేతల అభినందనలు


అనురాధకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలుపుతున్న వెంకటరావు

కె.కోటపాడు : వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఈర్లె అనురాధను నియమించడం శుభపరిణామమని రొంగలినాయుడుపాలెం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యడ్ల వెంకటరావు అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వై.ఎస్.జగన్ ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అనురాధను శనివారం ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పార్టీ పటిష్టతకు పని చేసిన అనురాధ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తారని వెంకటరావు పేర్కొన్నారు. అనురాధను కలిసి శుభాకాంక్షలను తెలిపిన వారిలో మూనూరు శ్రీరామ్మూర్తి ఉన్నారు.

వితంతు పింఛనుకు దరఖాస్తు చేసుకోండి

మాడుగుల రూరల్ : భర్త చనిపోయి, వితంతు పింఛను కోసం అర్హులు ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు శనివారం ఓ ప్రకటనలో కోరారు. 2023 డిసెంబరు 1వ తేదీ నుంచి 2024 అక్టోబరు 31 మధ్య పింఛను పొందుతూ చనిపోయిన భర్త స్థానంలో భార్యకు ఎన్టీఆర్ భరోసా పింఛను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మండలంలో 22 సచివాలయాల పరిధిలో 166 మంది వితంతులు దీనికి అర్హులుగా ఉన్నారన్నారు. దరఖాస్తుదారులు మరణించిన వ్యక్తి మరణ ధృవీకరణపత్రం, ఆధార్ జెరాక్స్, భార్య(వితంతువు) ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలతో ఆయా గ్రామ సచివాలయాల్లో అందజేయాలని కోరారు. వీరికి మే నెలలో పింఛన్లు మంజూరు చేస్తారని ఎంపీడీవో పేర్కొన్నారు.

సీఆర్‌ఎంటీపై విచారణ

నర్సీపట్నం : కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సీపట్నం మండలం సీఆర్‌ఎంటీ వెంకటరావుపై ఎస్ఎస్ఏ అధికారులు విచారణ చేపట్టారు. సీఆర్‌ఎంటీ వెంకటరావు తప్పుడు ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం పొందాడని పీఆర్‌టీయు నాయకులు ఈ నెల 21న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై ఎస్ఎస్ఏ ఏఎంవో(అసిస్టెంట్ మోనిటరింగ్ ఆఫీసర్) పట్నాయక్, ఎంఈవో తలుపులు, నాగేంద్రను విచారణ అధికారులుగా నియమించారు. విచారణ బృందం ఈ నెల 25న నర్సీపట్నం ఎంఈవో కార్యాలయంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరావు తప్పుడు ధ్రువీకరణ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందడంతో పాటు ఉపాధ్యాయులను పరుష పదజాలంతో దూషిస్తున్నారని పీఆర్టీయు, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు లిఖిత పూర్వకంగా మరోసారి విచారణ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీల స్టేట్‌మెంట్ రికార్డు చేసి కలెక్టర్‌కు నివేదించామని విచారణ అధికారులు తెలిపారు.

జూన్ 3 న మోదకొండమ్మ పండగ

మాడుగుల : జూన్ 3 వ తేదీన అంగరంగ వైభవంగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ నెల రోజులు పండగ నిర్వహించడానికి కమిటీ తీర్మానించిందని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు సహకారంతో పండగ అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని అప్పలరాజు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాలి

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, విద్యాహక్కు చట్ట ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కల్పించాలని ఎంఈవోలు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. మండలంలో గల ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులతో శనివారం సమావేశం నిర్వహించారు. రూ.లక్షా 20వేల ఆదాయం లోపు ఉన్న కుటుంబాల్లో గల పేద విద్యార్థులకు 1వ తరగతిలో ప్రవేశాలను తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచితంగా సీటు పొందేందుకు ఆన్‌లైన్‌లో ఈ నెల 28 నుండి మే 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.